రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజేంద్రనగర్‌: బుద్వేల్‌లోని బన్సీలాల్‌నగర్‌ భారత్‌ పెట్రోల్‌ పంపు ఎదురుగా శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. రాఫా ప్రకృతి యోగా, ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్‌ అగర్వాల్‌ కంటి ఆస్పత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్స్‌: 90637 61343, 70325 61343లలో సంప్రదించాలన్నారు.

15 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్‌లోని శివరామకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న సాయంత్రం 4 గంటలకు విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ మొదటి ఆహ్వాన పత్రికను రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్‌ స్వామిగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మన్నే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే పర్యటనలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కరించేందుకే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నానని బీజేపీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న అండర్‌ గ్రౌండ్‌ రైల్వే బ్రిడ్జి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిడ్జీ పనులలో భాగంగా సివరేజీ పైప్‌లైన్‌, స్ట్రామ్‌ వాటర్‌ పైప్‌లైన్‌ స్థానికులకు ఇబ్బంది కలగకుండా నిర్మించాలన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఏఈ నర్సింహమూర్తి, జలమండలి జీఎం ఖాదర్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాహుల్‌, లోక్‌నాథ్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ సలావుద్దీన్‌, డీఈ సత్యనారాయణ, నేతలు షేక్‌ వాహిద్‌, ఖాలేద్‌, దాసు, రావుల భాస్కర్‌, జబ్బార్‌ పాషా, అలీ, ఎన్‌.శంకర్‌, పాండుయాదవ్‌ పాల్గొన్నారు.

'కార్వాన్‌లో బీజేపీ పటిష్టంగా ఉంది'

గోల్కొండ: కార్వాన్‌ డివిజన్‌లో బీజేపీ పటిష్టంగా ఉందని బీజేపీ అధ్యక్షుడు ఉద్దతి జగదీష్‌కుమార్‌ అన్నారు. గురువారం కార్వాన్‌ శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో బీజేపీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజు రోజుకూ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ అసమర్థ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ సుస్థిర పాలనపై కూడా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్‌ మాజీ అధ్యక్షుడు దొర్శల శ్రీనివాస్‌, కార్వాన్‌ జిల్లా కౌన్సిల్‌ సభ్యుడు గంజి రఘునాథ్‌ను సన్మానించారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేత



గోల్కొండ: టోలిచౌకీ హకీంపేట్‌, సాలర్‌బ్రిడ్జీ తదితర ప్రాంతాల్లో బల్దియా వారు అనుమతులు లేని కట్టడాలను, ఫుట్‌పాత్‌ ఆక్రమణలను కూల్చివేశారు. బల్దియా కార్వాన్‌ సర్కిల్‌ ఖైరతాబాద్‌ జోన్‌ బృందం టోలిచౌకీ ఫ్లై ఓవర్‌, హకీంపేట్‌ సాలర్‌ బ్రిడ్జీ తదితర ప్రాంతాల్లో వెలిసిన ఆక్రమ కట్టడాలను, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను కూల్చివేశారు. కాగా ఈ కూల్చివేతలపై స్థానిక వ్యాపారులే కాక టోలిచౌకీ హకీంపేట్‌కు చెందిన వివిధ బస్తీలు, కాలనీల వాసుల నుంచి హర్షం వ్యక్తం అవుతుంది.

కేటీఆర్‌పై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్‌: సోషల్‌ మీడియాలో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బేగంబజార్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్‌, గోషామహల్‌ బీఆర్‌ఎస్‌ నాయకుడు కోటి శైలేష్‌ కురుమ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం షాహినాయత్‌గంజ్‌ పోలీస్‌ స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగం రవీందర్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోషల్‌ మీడియాలో కేటీఆర్‌పై దిగజారుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

పన్ను పోటు.. తలపోటు!

మణికొండలో అడ్డగోలుగా పెరిగిన ఆస్తిపన్ను

- ఐదు రెట్లు పెంచటంతో ప్రజల గగ్గోలు
- భువన్‌ సర్వే తీరుపై సర్వత్రా నిరసన
- చట్టవిరుద్ధం అంటున్న ప్రజలు
- రాష్ట్రమంతా పెరిగిందంటున్న అధికారులు



మణికొండ మున్సిపల్‌ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో కొన్ని ఇళ్లపై మున్సిపల్‌ అధికారులు పన్నుపోటు వేశారు. గత సంవత్సరం వరకు ఉన్న ఆస్తు పన్నును ఏకంగా ఐదు రెట్లు పెంచటంతో వారు లబోదిబోమంటున్నారు. మున్సిపల్‌ చట్టం 2019, కోర్టు తీర్పులకు ఇది విరుద్ధమని పలువురు వాదిస్తున్నారు. గత సంవత్సరం వరకు రూ. వందల్లో ఉన్న తమ ఇంటి పన్నును ఏకంగా రూ. వేలల్లో పెంచారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- హైదరాబాద్‌ నగర శివార్లలో మున్సిపాలిటీలు ఏర్పాటు కాకముందు గ్రామ పంచాయతీల పాలన కొనసాగింది. అందులో భూమి రిజిస్ట్రేషన్‌ విలువ, ఇంటి నిర్మాణం తీరు, విలువను బట్టి పన్నులు వేసే వారు. అది రూ. వందల్లో మాత్రమే ఉండేది. మున్సిపాలిటీలు అవతరించిన తరువాత అప్పటి నుంచి వచ్చే నిర్మాణాలకు వారి నిబంధనల ప్రకారం పన్నులు వేసే వారు. పాత గృహాలకు గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు ఎలాంటి పన్ను పెంపు ఉండదని మినహాయింపు ఇచ్చింది. దాంతో వారికి పెద్దగా మార్పులు లేకుండానే పన్నులు వేయటం, వారు చెల్లించటం జరిగిపోయింది.

భువన్‌ సర్వేతో...

మున్సిపాలిటీలలో పెద్ద గృహాలు ఉన్నా కొన్ని గృహాలకు తక్కువ పన్నులు ఉన్నాయని మున్సిపల్‌ ఉన్నతాధికారులు రెండు సంవత్సరాల క్రితం గుర్తించారు. ఎలాగో ప్రభుత్వం ఇచ్చిన మూడు సంవత్సరాల రాయితీ గడువు ముగిసిపోవటంతో అన్ని గృహాల పన్నును సమంగా చేయాలని నిర్ణయించారు. దాంతో భువన్‌ సర్వే చేపట్టారు. సర్వే నిమిత్తం వచ్చిన సిబ్బంది నెలల తరబడి మున్సిపాలిటీల్లోనే ఉండి ప్రతి ఇంటి కొలతలను తీసి ఆన్‌లైన్‌ యాప్‌లో నిక్షిప్తం చేశారు. దాంతో ఉన్న కొలతలు, వస్తున్న ఇంటి పన్నును మార్పులు చేసి కొత్త పన్నును విధించాలని నిర్ణయించారు. ఇతర మున్సిపాలిటీలలో భూ విలువ, నిర్మాణ విలువ అంతంత మాత్రంగా ఉండటంతో పన్నులలో పెద్దగా పెంపు జరగకపోవటంతో ప్రజలు అంతగా పట్టించుకోలేదు. అదే మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గజం భూమి విలువ మణికొండ గ్రామానికి రూ. 22 వేలు, పుప్పాలగూడకు రూ. 18 వేలు, నెక్నాంపూర్‌కు రూ. 13.500లు రిజిస్ట్రేషన్‌ విలువ ఉండటంతో భువన్‌ సర్వే ఆధారంగా పన్నులు అమాంతం పెరిగిపోయాయి.

- 2024-25వ సంవత్సరం పన్నులోనూ ఆరు నెలల వరకు పాత పన్ను ఉండగా మిగిలిన ఆరు నెలలకు మాత్రం కొత్త పన్ను వచ్చింది. సంవత్సరం పన్ను మొత్తం చెల్లించిన వారికి సైతం కొత్తగా పెరిగిన మొత్తం బకాయిగా చూయిస్తుంది. దాంతో ఆయా గృహాల యజమానులు ఒకేసారి ఇంతలా పన్నులు పెరగటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్‌ చట్టం-2019 (100)2, 4 ప్రకారం ఇంటి పన్నులను మదింపు చేసే సమయంలో తమకు నోటీసు ఇవ్వటం, తమ ఆక్షేపణలను నమోదు చేయలేదని పలువురు పేర్కొన్నారు. పెరిగిన పన్నును వెంటనే చెల్లించాలని సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విషయాన్ని గురువారం మున్సిపల్‌ కమిషనర్‌ డి.ప్రదీప్‌కుమార్‌, మేనేజర్‌ కె.శ్రీధర్‌ దృష్టికి తీసుకెళ్లారు.

ఇన్ని రెట్లు పెంచడం సరికాదు



సగానికిపైగా గృహాలకు పన్నులు పెరిగాయి. ఒక్కసారిగా తమ ఇంటి పన్ను అంతలా ఎందుకు పెరిగిందో అర్థం కాని పరిస్థితి. తమ ఇంటి స్థలాలు, చదరపు అడుగులు తప్పుగా నమోదు అయి పన్ను ఎక్కువగా వచ్చిన వారు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆక్షేపణలు ఇవ్వాలి. ఒక్కసారిగా ఇన్ని రెట్లు పన్ను పెంచటం పద్ధతి కాదు. ఈ విషయాన్ని మున్సిపల్‌ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వి.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి, ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌

అభ్యంతరాలుంటే మరోసారి తనిఖీ



గతంలో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలలో ఉన్న పన్నుల వత్యాసాలను గమనించి, గ్రామ పంచాయతీల కాలంలో జరిగిన పొరపాట్లను సరిచేయాలని నిర్ణయించింది. అందరికీ ఒకే విధంగా పన్నులు వేయాలని నిర్ణయించి భువన్‌ సర్వే చేపట్టింది. రెండేళ్ల క్రితమే అన్ని మున్సిపాలిటీలలో కొత్త పన్ను విధానం అమలులోకి వచ్చింది. మణికొండలో సాంకేతిక కారణాలతో ఈ సంవత్సరం అమలు చేస్తున్నాం. ఇక్కడి భూమి విలువలతో పన్ను అధికంగా రావటం సహజం. మున్సిపాలిటీ పరిధిలో 52 వేల గృహాలకు గాను 21,230 గృహాలకు పన్ను పెరిగింది. అభ్యంతరాలు ఇస్తే మరోసారి తనిఖీ చేస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్‌, కమిషనర్‌, మణికొండ

కోర్టు తీర్పులకు విరుద్ధం



ఆస్తి పన్నును అధికారులు, ప్రభుత్వం ఏ కారణాలతోనైనా సంవత్సరం వారీగా పెంచకపోతే అది వారి తప్పుగానే పరిగణించాలని కోర్టు గతంలో పలు కేసులలో పేర్కొంది. పెంచే సమయంలో ఉన్న పన్నును రెట్టింపుకంటే అధికంగా పెంచకూడదనే తీర్పులు ఉన్నాయి. వాటికి విరుద్ధంగా మున్సిపల్‌ చట్ట నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఐదింతల మేర పన్ను పెంచటం దారుణం. ఈ విషయంలో మరోమారు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం అవుతున్నాం. – డి.సీతారాందాస్‌, హుడా కాలనీ, మణికొండ

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

శంషాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు బాటలు వేస్తుండటంపై పీసీసీ ఎస్సీ సెల్‌ నేతలు గురువారం ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు ప్రీతం, ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌లు సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వర్గీకరణపై మూడు దశాబ్దాలుగా జరుగుతున్న పోరాటాలను కాంగ్రెస్‌ ప్రభుత్వ గుర్తించిందన్నారు. పోరాటాలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి మాదిగ సామాజికవర్గం అండగా ఉంటుందన్నారు.

ఇన్‌స్పెక్టర్ల బదిలీ

గచ్చిబౌలి: సైబరాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లను కమిషనర్‌ అవినాష్‌ మహంతి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గచ్చిబౌలి ట్రాఫిక్‌ పీఎస్‌ ఎస్‌హెచ్‌ఓ ఎస్‌.రాజశేఖర్‌ రెడ్డిని కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓగా, ఆయన స్థానంలో రాజేంద్రనగర్‌ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌ జి.సురేష్‌ బదిలీపై వచ్చారు. గచ్చిబౌలి డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ పి.రాజేష్‌ను కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కొత్తపల్లి ముత్తును సీటీసీకి బదిలీ చేశారు.

హోటల్‌కు హైడ్రా నోటీసులు

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌ రోడ్డునెంబర్‌-1లోని ఫిలింనగర్‌ సొసైటీ లే అవుట్‌లో తనకు కేటాయించిన ప్లాట్‌ ఖాళీ జాగాను ఆక్రమించిన యజమాని అక్రమ నిర్మాణం చేపట్టి హోటల్‌కు అద్దెకు ఇవ్వగా ఈ కట్టడాన్ని కూల్చివేయాలంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేశారు. ఫిలింనగర్‌ రోడ్డునెంబర్‌-1లో విగ్రహాల చౌరస్తాలో శంకర్‌ విలాస్‌ పేరుతో హోటల్‌ కొనసాగుతుంది. అయితే ప్లాట్‌ యజమాని రోడ్డు కోసం లే అవుట్‌లో వదిలిన 59 గజాల స్థలాన్ని కబ్జా చేసి హోటల్‌కు అద్దెకు ఇచ్చినట్లుగా హైడ్రాకు ఫిర్యాదు అందింది. ఈ హోటల్‌ను కూల్చివేసి స్థలాన్ని రోడ్డుకు కేటాయించడం జరుగుతుందని శంకర్‌ విలాస్‌ హోటల్‌ యజమానికి హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేశారు. హైడ్రా నోటీసులతో స్థానిక వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు జ్ఞాపికను అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మణికొండ: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్ది సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌ గ్రామంలోని విద్యావికాస్‌ ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవం గురువారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్‌ సాకారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ టి.మల్లేష్‌ముదిరాజ్‌, మండల విద్యాధికారి విజయ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ టి.హేమలత, కరస్పాండెంట్‌ టి.రాములు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్‌ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్వాన్‌, జియాగూడ, లంగర్‌హౌస్‌ తదితర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ విధంగా వచ్చిన మహిళల్లో ఎక్కువ మంది ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌ కార్డులు, పింఛన్‌లు తదితర విషయాలపై ఎమ్మెల్యే వద్ద తమ గోడును విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళనకు గురి కావద్దు అని అర్హులైన వారికి ఇల్లు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యుత్‌ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..

విద్యుత్‌ శాఖకు చెందిన అధికారులు తమ తమ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌ అన్నారు. గురువారం టోలిచౌకీ మెరాజ్‌ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్‌ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత కొన్ని నెలల క్రితం తాను ఇదే విధంగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించానని ఆ సమావేశంలో తాను సూచించిన సమస్యలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, డీఈ టి.సుధాకర్‌, ఏడీఈ ఆర్‌.బిక్కు, మాధవరావు, మహ్మద్‌ యాకుబ్‌బాషా, మహ్మద్‌ జాఫర్‌, ఏడీఈ శంకర్‌నాయక్‌ తదితరులున్నారు.

శివసేనారెడ్డికి సన్మానం

గోల్కొండ/జియాగూడ: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడారంగానికి ప్రోత్సాహం పెరిగిందని తెలంగాణ స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనారెడ్డి అన్నారు. కార్వాన్‌ కాంగ్రెస్‌ ఏ-బ్లాక్‌ అధ్యక్షుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జియాగూడ మున్సిపల్‌ గ్రౌండ్‌లో 4వ వీర్‌ చంద్రశేఖర్‌ ఆజాద్‌ రెజ్లింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు రావాల్సిందిగా ఈ సందర్భంగా ఆయనను కోరారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ..గత సంవత్సర కాలంలో తెలంగాణ క్రీడాకారులు తమ తమ రంగాల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలో సైతం రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ ముంగి రఘుపాల్‌రెడ్డి, అబ్దుల్‌ హమీద్‌, నరమ్‌సింగ్‌, జె.నర్సింగ్‌, కురాకుల రఘువీర్‌, జి.కిషన్‌, రాంకుమార్‌, తదితరులున్నారు.

రంగనాథస్వామి పల్లకీ సేవ



రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతంలోని రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో బాలభోగ, అర్చన, బలిహరణ, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అంతకుముందు ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకం చేశారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రభుత్వ ఫైనార్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆనంద్‌రావు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్‌ జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైనార్ట్స్‌ యూనివర్సిటీలోని ప్రభుత్వ లలిత కళల కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్‌ ఎంఎల్‌ ఆనంద్‌రావును ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు తోటి ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌రావు మాట్లాడుతూ..విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించి వారు జీవితంలో త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు, జె.వెంకటేశ్వర్లు, కె.హరీష్‌బాబు, కె.కాంతారెడ్డి, ఆనంద్‌ గడప, సతీష్‌కుమార్‌, వేణు మనోహర్‌తో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పీసీఓడీపై మహిళలకు అవగాహన

చార్మినార్‌: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించడానికి వీలు కలుగుతుందని ఉమెన్‌ ఎంపవర్మెంట్‌ సెల్‌ అండ్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ యూనిట్‌-2, కన్వీనర్‌ డాక్టర్‌ శ్రీదేవి అన్నారు. ఆరోగ్యమే లక్ష్యంగా గురువారం సిటీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, ఎన్‌ఎస్‌ఎస్‌ సంయుక్తాధ్వర్యంలో శ్రీ సత్య సాయి సేవా సమితి సహకారంతో ఉమెన్‌ వెల్నెస్‌ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పీసీఓడీపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.బాల భాస్కర్‌ అధ్యక్షత వహించగా..రిసోర్స్‌ పర్సన్‌గా డాక్టర్‌ సరస్వతి వ్యవహరించి పీసీఓడీపైన మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళలు ఆరోగ్యంగా ఉండడానికి రోజు వారి వ్యాయామం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్‌ కృష్ణచంద్ర కీర్తి, డాక్టర్‌ తిరుపతి, డాక్టర్‌ నాగరాజు లతో పాటు అవధానం సుజాత, అనసూయ, ప్రసన్న పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహా సభకు ఎన్నికలు నిర్వహించండి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభకు వెంటనే చట్టప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్రంలోని లక్షలాది మంది ఆర్యవైశ్యులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అసోసియేషన్‌ కార్యవర్గ సభ్యులు సంబు వెంకటరమణ డిమాండ్‌ చేశారు. 13 ఏళ్లుగా ఆర్యవైశ్య మహా సభకు ఒకే వ్యక్తి అధ్యక్షుడిగా ఉండడం ఎంతో బాధాకరమన్నారు. గురువారం ఆయన లక్డీకాపూల్‌లోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ..ప్రతి రెండు సంవత్సరాలకు చట్ట ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆర్యవైశ్యుల ఎన్నికలు జరుగుతుండగా రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభకు మాత్రం ఎందుకు ఎన్నికలు జరగడం లేదన్నారు. ఆర్యవైశ్య మహాసభ నిబంధనల ప్రకారం వెంటనే ఎన్నికలు జరపాలన్నారు. ఒక వ్యక్తి 13 ఏళ్ల పాటు ఒకే పదవిలో కొనసాగితే ఆర్యవైశ్యులకు ఎలా న్యాయం జరుగుతుందని సంబు వెంకటర రమణ ప్రశ్నించారు. వెంటనే ఎన్నికలు జరిపి చట్ట ప్రకారం ఆర్యవైశ్యులకు న్యాయం జరిగే విధంగా మహా సభ చర్యలు తీసుకోవాలన్నారు.

చెరువుల అభివృద్ధి పనులను పూర్తి చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్‌ నేతలు

మణికొండ: చెరువుల అభివృద్ధి మధ్యలో నిలిచిపోవటంతో గుర్రపుడెక్క పెరిగి దోమలు, దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి పనులు పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కలిగించాలని కాంగ్రెస్‌ పార్టీ మణికొండ మున్సిపల్‌ నాయకులు జిల్లా కలెక్టర్‌ నారాయణరెడ్డిని కోరారు. గురువారం కలెక్టర్‌ కార్యాలయంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ మున్సిపల్‌ శాఖ అధ్యక్షుడు ఎం.జితేందర్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌ మాట్లాడుతూ... నెక్నాంపూర్‌ పెద్ద, చిన్న చెరువులలో తరచూ గుర్రపు డెక్క పెరగటం, మురికి నీరు కలుస్తుండటంతో చుట్టు పక్కల నివసించే ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ. 21.62 కోట్లతో పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేసిందన్నారు. వాటిని పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అలకాపూర్‌ టౌన్‌షిప్‌ మీదుగా రేడియల్‌ రోడ్డు 4-5ల మధ్య కనెక్టివిటీ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. దాంతో ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నదన్నారు. అలకాపూర్‌ టౌన్‌షిప్‌ ప్రజలు సామూహిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్‌ లేక తీవ్ర ఇబ్బందిగా మారిందని, దానిని నిర్మించాలని కోరామని వారు పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు సమాజ సేవ చేయాలి

సీబీఐటీ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి



రక్తదాతలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి తదితరులు

మణికొండ: ఎన్‌ఎస్‌ఎస్‌లో ఉన్న విద్యార్థులు సమాజానికి వీలయినంతమేర సేవ చేయాలని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (సీబీఐటీ) చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి అన్నారు. గురువారం గండిపేటలోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు నిర్వహించిన లయన్స్‌ కల్బర్‌ జూబ్లీహిల్స్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రక్తదానం చేయటం మహత్తరమైన మానవ సేవ అన్నారు. ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం లభించక ప్రతి రోజు వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి సాయంగా రక్తదానం చేయటం హర్షణీయమన్నారు. రక్తదానం చేస్తున్న ప్రతి వ్యక్తి సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సి.వి.నరసింహులు, లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు ధర్మేందర్‌రెడ్డి, స్టూడెంట్‌ ఎఫైర్స్‌ డైరెక్టర్‌ లింగారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్‌ శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

చింతల్‌మెట్‌లో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌గౌడ్‌

అత్తాపూర్‌: డ్రైవింగ్‌ లైసెన్సులు లేని వారు, మైనర్లు, త్రిబుల్‌ రైడింగ్‌ చేసే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.రాజేందర్‌గౌడ్‌ హెచ్చరించారు. చింతల్‌మెట్‌ చౌరస్తాలో గురువారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనర్‌ల తల్లిదండ్రులకు ఇన్‌స్పెక్టర్‌ కౌన్సిలింగ్‌ ఇచ్చారు. మైనర్లకు కుటుంబ సభ్యులు ఎలాంటి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. వాహన కెపాసిటీ ఆధారంగా మాత్రమే ఆ వాహనాలపై ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. 15 ద్విచక్ర వాహనాలను సీజ్‌ చేయడంతో పాటు పెనాల్టీలను విధించారు.